# ఆణిముత్యాలు

**డా॥ సోమరాజు సుశీల**

సోమరాజు సుశీల సాలిడ్ స్టేట్ కెమిస్ట్రీలో డాక్టరేట్ చేసి, శాస్త్రవేత్తగా స్థిరపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా, సిద్ధాంతంలో 1945లో జన్మించాఉ. చాలా ఆలస్యంగా రచనా వ్యాసంగంలో చేయి చేసుకుని, చాలా త్వరగా మంచి పేరు తెచ్చుకున్నారు. 1998 చిన్నపరిశ్రమలు-పెద్దకథలు, ఇల్లేరమ్మ కతలు సోమరాజు సుశీలని మంచి రచయిత్రిగా అశేష పాఠకులకు పరిచయం చేశాయి. రామాయణ భారతాల విశ్లేషణాత్మక వ్యాసపరంపరను మరాఠీ నుంచి తెలుగులోకి అనువదించారు. అవి రెండ పుస్తకాలుగా వెలువడి అచ్చతెలుగు రచనలవలె ప్రాచుర్యం పొందాయి.

భారత వాతావరణశాఖ వినియోగం కోసం ''థర్మిస్టర్స్'' అనే చిన్న పరికరాలను కొవ్వొత్తి వెలుగులో అలవోకగా చేయగల శాస్త్రనైపుణ్యం తెలిసిన ఏకైక వ్యక్తి డా॥ సోమరాజు సుశీల. అలాగే చిన్న సంఘటనని, మనమధ్య తిరిగే మనుషుల్ని కథల్లో ఇమిడ్చి రక్తికట్టించే వాడుపు తెలిసిన కథకురాలు. ఇటీవల విడుదలైన దీపశిఖ కథా సంపుటిలోనిది ''ఈవెంట్ మేనేజర్''. ఎన్నిప్రత్యేక చదువులుచదివినా; అనుభవం అమేయమైన కామన్‌సెన్స్‌కి సాటిరావని చెప్పేకథ. ఎందరికో నచ్చిన కథ. ఎందరో మెచ్చిన కథ. రచనా కాలం 2003.

# ఈవెంట్ మేనేజర్

ఇప్పటి మాటా!ఎప్పుడో యాభై ఏళ్ళనాటిది. రెండో ప్రపంచ యుద్ధం డిప్రెషన్‌లో చిత్తయి కుదేలయిన కుటుంబంలో పెద్ద పిల్ల పెళ్ళి. అదీ మేనమామతో, గుడి సత్రంలో. ఎవరు మగపెళ్ళివారో, ఎవరు ఆడపెళ్ళివారో ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి. పెళ్ళివారి బస్సు సత్రం ముందు ఆగగానే పెళ్ళికూతురి తల్లి వియ్యపురాలిని కావ లించుకుని 'అమ్మా' అంటూ బావురుమంది.

'తప్పు! తప్పు! శుభమా అంటూ పెళ్ళివారొస్తే అలా కళ్ళనీళ్ళు పెట్టుకోకూడద'ని పెద్దవాళ్ళు కేకలేశారు. ఆ ఏడుపేదో అప్పగింతలయ్యాకంటూ కన్యాదాత కసురు కున్నాడు.

''మీ ఇంట్లో అందరూ ఇంతే! మనసులు మహాకఠినం! మన చిట్టిగాడుండుంటే ఈవేళ ఎంత సందడి! అక్కని నేలమీద నడవనిచ్చేవాడా? మీరొక్కరే అన్ని పనులూ నొల్లుకుంటూ సైకిలుమీద తిరిగేవారా? నా బతుకే పాపిష్టిది'' - ఐదేళ్ళనాడు రెండు రోజుల జ్వరంతో కన్నుమూసిన కొడుకుని తల్చుకుని మళ్ళీ ఇంకొక్క వరస కళ్ళనీళ్ళాపుకుంటూనే తమ్ముడికి, అదే కాబోయే అల్లు డికి హారతిచ్చింది.

ఆ రోజులలో మనుషులు పోయి పదేళ్ళయినా కూడా శుభాశుభాలప్పుడు అయినవాళ్ళు కనిపిస్తే కళ్ళనీళ్ళు నదులుగా ప్రవహించేవి. మరిప్పుడు ఎవరైనా పోయారని పలకరిద్దామని ఏ మర్నాడో వెడితే పిజ్జాలో బిరియానీలో తెప్పించుకుని, సీరియల్స్ చూస్తూ తింటూ ఉంటారు పోయినవాడి ఫోటో ముందుంచిన అగరొత్తుల పొగకి దగ్గుతూ.

విషాదాన్ని వెంటనే మర్చిపోవడం ఇప్పటి పద్ధతి.

ఒక్క రాజకీయ నాయకులు పోతే మాత్రం టీ.వీ సాక్షిగా దేశమంతా మూడు రోజులేడుస్తుంది.

బస్సు దిగిన వాళ్ళు పెద్ద పెళ్ళివారిలా డాబుగా ఏం లేరు. తెల్లారగట్ల లేచి బస్సులో కోటిపల్లి రేవుకొచ్చి గోదారి దాటి, మళ్ళీ బస్సెక్కి నాలుగింటికి విడిదికి చేరిన వాళ్ళెంత నీరసంగా దుమ్ముకొట్టుకుపోయుంటారో అలాగే ఉన్నారు. అందరికీ ఆడపెళ్ళివారి సత్తామీద అనుమానమే. పాపం ఉత్తినే భయపడ్డారు గానీ సత్రమైనా ఎంత కళకళలాడిపోతోందో! ఎటు చూసినా ముగ్గులే. ఎన్నిరకాలో, నడవలోనూ, మెట్లమీదా, గదుల్లోనూ వేసిన ముగ్గు వేయకుండా కళ్ళు చెదిరిపోయేటట్టు. ఇంక రాత్రి పెళ్ళి జరగాల్సిన హాల్లో అయితే పెద్ద కళ్యాణ మండపం ముగ్గు. పెళ్ళి కొడుక్కి అతని స్నేహితులకీ అని కేటాయించిన గది వాకిటికి నెమళ్ళు అల్లిన లేసుల తోరణం. అందులోనే చెరోపక్కా వధూవరుల పేర్లు కూడా అల్లి కలో వచ్చేశాయి.

''ఏవే కావుడూ! ఈ ముగ్గులన్నీ మన స్వర్ణగాడు పెట్టినవేగా! ఈ లేసెప్పుడల్లిందే?'' అంటూ అత్తగారు, మనవరాలు అంటే కాబోయే కోడలి పనితనాన్ని చూసి మురిసిపోయింది.

''ఫలహారాలు కానిద్దురుగాని రండి'' అంటూ చిన్న విస్తళ్ళేశారు. వీళ్ళు అద్దెకుండే ప్లీడరు గారి భార్య తన నోముల్లో నందికేశుడి శనగలు, పరవాన్నం మిగిలిపోయాయని బాధపడుతుంటే 'మా మనవరాలి పెళ్ళిలో చెల్లిం

## రాబడే

పన్నెండేళ్ళ క్రితం
ఇక్కడో కోళ్ళఫాం ఉండేది
కోళ్ళు, దానా బుక్కేవి, గుడ్లు పెట్టేవి
బడే వ్యాపారం నాడు అది.
కాలక్రమంలా యజమానికి
ఇంకా బడీ వ్యాపారమేదో తెలిసిపోయింది
కోళ్ళఫామ్ షెడ్లను
కళాశాలగా మార్చాడు
రాబడే... రా బడి

సబ్బని లక్ష్మీనారాయణ

## పాపం అధ్యక్షా!!

పీకలమీద కత్తిపెట్టి
రూలింగిమ్మంటారు
రణగొణ ధ్వనులమధ్య
వాగిన వాగుళ్ళన్నీ
రికార్డుల నుంచి తొలగించమంటారు
పాపం! అధికార అనధికార పక్షాల
అడకత్తెరలో పోకచెక్క స్పీకరు
ఇద్దరు కన్నా ఎక్కువ
పెళ్ళాల మొగుడు కూడా
ఇంతకన్నా
సుఖంగా వుంటాడు

జోరా శర్మ

చేసుకోండ'ని చెప్పి ఆవిడకి సాయంచేసి పెట్టింది పెళ్ళికూతురి బామ్మ సరమ్మగారు.

''సరి! సరి! ఫలహారాలంటే ఏ ఉల్లిపాయ పకోడీలన్నా ఉంటాయనుకున్నా! ఈ నందికేశుడి ప్రసాదాలా?'' అని వెక్కిరిస్తూనే పెళ్ళికొడుకు పెద్ద బావగారు ఆ నాలుగ్గింజలూ నోట్లో వేసుకున్నాడు. ఆకలి మహాత్మ్యం అలాటిది మరి!

''బావా! నా మాట దక్కించు! స్వర్ణ నీ కూతురే అనుకో'' అని దణ్ణం పెట్టింది కాముడు. ఇంటికి పెద్దల్లుడంటే వియ్యంకుడి కన్నా పవర్‌ఫుల్ కదా మరి. అందరూ తలోపక్కనా సామాన్లు సర్దుకుని స్థిమితపడ్డాక వియ్యాపురాలిని పలకరించేందుకు విడిది గదికి వెళ్ళింది సరమ్మగారు.

''ఏం వదినా! ప్రయాణంలో ఇబ్బంది పడలేదు కదా! అన్నగారేరీ కనబడ్డం లేదూ! ఇదిగో ఈ పట్టు మేం ఆడపెళ్ళివారం. మీరు మగపెళ్ళివారైపోయారు. మీకు చేయాల్సిన మర్యాదలన్నీ మీ అమ్మాయికే అప్పజెప్పా. అన్నీ అడిగి చేయించుకోండి. రెండింటికి స్నాతకం పీటలమీద కూచోవాలిట. ఇంక మా బంగారు తల్లి స్వర్ణ గాడు మీ ఇంట్లో అడుగుపెట్టిందంటే మీకెలా కలిసొ స్తుందో చూడండి? దానిది మహారాణి జాతకం. ఎవరు దాని చెయ్యిపట్టినా ముద్రికా యోగం తపపదని అది పుట్టినప్పుడే వాళ్ళ తాతగారు రాసుంచారు. ఇంక మన భాస్కరం కలెక్టరయ్యేది ఖాయం. అంతా మీ అదృష్టం

## చే'నేత'

అగ్గిపెట్టెలో
చే'నేత'
అయ్యాడు ఇప్పుడు ప్రేత

## నేను

నేను
మాట్లాడితే
అపార్థం!?
నేను
మౌనినైతే
పరమార్థం!

దయాకరరావు

వదినా! మా ఇంటిపిల్ల మీ ఇల్లు మెడుతోంది. ముగ్గులు చూశారా! మూడు రోజుల్నుంచీ పొద్దున్నే వచ్చి సాయంత్రం వరకు గుడినిండా కూడా వేసేసింది. పూజారి గారు ఎంత సంతోషించారో. ముహూర్తం టైంకి స్వామివారి తరఫున పూలహారాలు పంపిస్తానన్నారు. ఇంక నే మళ్ళీ కనిపిస్తా'' అంటూ వచ్చినావిడ వెళ్ళిపోయింది.

మాట్లాడాల్సినవన్నీ మాట్లాడేయడమే కానీ ఎదుటి వాళ్ళని నోరిప్పనిచ్చే స్వభావం కాదు సరమ్మగారిది. బిక్కమొహం వేసుకుని తలాడించడమే తప్ప నోరు పెగిల్తేనా పెళ్ళికొడుకు తల్లికి! పిల్లనిచ్చుకున్నామని చెప్పి పాతికేళ్ళుగా అణిగిమణిగున్నావిడకి ఇప్పుడు కొత్తగా వియ్యపురాలి హోదా ఏం వస్తుంది? జిల్లా మొత్తంలో ఎవరన్నా సరమ్మగారి ముందు నోరిప్పడమే! ఇంకేమైనా ఉందా!

అప్పుడు నోరు పెగిలింది పెళ్ళికొడుకు నాలుగో అక్కగారికి. అమ్మా అదేంటే అలా బిగుసుకుపోయావ్. మరీ విచిత్రం! తానొక్కతికే మనవరాలైనట్లు. దాన్ని చేసుకోవడం మన అదృష్టమన్నట్లు మరీ ఇంత గడుసుతనమా? పదివేల రూపాయల కట్నాన్ని కాదనుకుని అక్కమొఖం చూసి పిల్లని నువ్వు కడుపులో పడేసుకుంటుంటే, కాస్తన్నా గౌరవం లేకుండా! రేపు నిజంగా మన బాచిగాడు పరీక్ష పాసైతే వాళ్ళ గొప్పదనం వల్లే అంటుందేమో!

''పోన్లే! ఎవరి గొప్ప వల్లయితేనేం. వాడీ పరీక్ష గట్టెక్కి ఉద్యోగస్థుడైతే ఇంక మాకే బెంగా లేకుండా వాడి దగ్గిర పడుండచ్చు. రెండేళ్ళనించీ ఏ ఉద్యోగంలోనూ చేరకుండా రాత్రనక, పగలనక కష్టపడ్డాడు పిచ్చి నాగన్న. ఎన్నో అనుకుంటాం! ఎవరి అదృష్టాలెలా ఉంటాయో ఎవరికి తెలుసు? మన కావుడ్నిచ్చినప్పుడు వీళ్ళది మూడూళ్ళ కరణీకం, ముప్పై పుట్ల భూమి. వాళ్ళ ఊళ్ళో ఎవరి పెళ్ళన్నా మంగళ సూత్రాలూ, మధుపర్కాలూ ఆవిడ చేత్తో ఇవ్వాల్సిందే. ఎన్ని వందల పెళ్ళిళ్ళయ్యాయో ఆవిడ చేతుల్లో. కాలమహాత్యం కాకపోతే విస్సన్న పంతులుగారి మనవరాలి పెళ్ళి పక్క ఊళ్ళో దేవుడి గుడి సత్రంలో జరగడం ఏవిటి చెప్పు! కాలం ఎంతటి వాడ్నయినా వంచుతుందంటారు గానీ ఈవిడ్నేం చెయ్యలేకపోయింది. ఆస్తులు హరించిపోయినా ఝూంకారం పిసరంతైనా తగ్గలా!'' అని కూతుర్ని కాస్త హెచ్చరించింది.

''ఊరికే పోతాయేవిటే ఆస్తులూ! మావిడిపళ్ళు ఎవరెక్కువ తింటే వాళ్ళకి బహుమానాలని చెప్పి కావు అంతా ఊళ్ళో పిల్లలచేత తినిపించీ, ఎక్కడా పెళ్ళి కావాల్సిన పిల్లలు కనబడకపోతే ఓ పాలేరాడికి ఆడవేషం వేసి, ఇంకో పాలేరాడికిచ్చి మూడు రోజులు, బోగం మేళంతో సహా పెళ్ళిచేసీ, ఇడ్డెన్ల పద్దని చెప్పి సుబ్బయ్యశెట్టికి వారానికో వెండిగ్లాసు పంపించీ, ఇలా ఒకటా, రెండా... ఇదేగా వీళ్ళు చేసిన నిర్వాకం.

చూడు పాపం! పిల్ల జమీందారల్లే పెరిగిన చిన్న బావ ఇప్పుడు మండుటెండలో సైకిలెక్కి తిరుగుతూ, కాంట్రాక్టరు దగ్గర మేస్త్రీ ఉద్యోగం చేస్తూ రెండు గదుల కొంపలో ఒక్కడూ ఇంటి భారాన్ని మోస్తూ! ఇన్నేళ్ళయి కాపురానికొచ్చినా అక్కకి ఏ విషయంలోనూ నోరెత్తడానికి లేదు కదా! అదో వెర్రిబాగుల్ది. 'ఆ' అన్నా, 'ఊ' అన్నా అన్నిటికీ బావురుమనడం తప్ప ఏమీ తెలియదు. అందుకే మనమందరం ఆవిడకి లోకువ. అక్కలాగే చేతకాని వాళ్ళం అనుకుంటోంది'' ఆడబడుచు కదా మరి. మట్లాడకుండా వుండలేకపోతోంది!

''సర్లే! నాన్నగారు పేకాటలో కూచున్నట్లున్నారు. నువ్వు వెళ్ళి నాన్నగారి దగ్గిర పదిరూపాయలుంచి, పర్సు పట్టుకెళ్ళి బాచికిచ్చేయి. తిరుగు ప్రయాణంలో అవస్థ పడిపోతాం. పెద్దాడ సూరం పిన్ని పిల్లలంతా ఆటలో దూరినట్లున్నారు. ఆఖరి దమ్మిడీ అయ్యేవరకూ వదలరు'' పేకాటలో స్థిరపడిపోయిన పెళ్ళి పెద్ద పర్సు దాచేందుకు కూతుర్ని పంపించింది.

ఒకప్పుడు తూర్పుగోదావరి జిల్లాలో దర్జాలకీ,

ధారాళానికీ పేరు పడ్డది విస్సన్న పంతులు గారి కుటుంబం. ఆరుగురన్నదమ్ములకీ ఆయనే పెద్ద. ఆయనకి ఒక్కడే కొడుకైనా లంకంత లోగిట్లో ఎటు చూసినా జనమే. ఎవరికీ ప్రత్యేకించి చదువులూ లేవు. పనులూ లేవు. కరణీకం పనులూ, వ్యవసాయం పనులూ అన్నీ ఆయనే చూసుకునేవాడు. ఇంట్లో ఆడవాళ్ళందరూ రకరకాలు వండుకోవడం, తిన్నంత తినడం, పారేసినంత పారేయడం, రెండ్రోజులకోసారి గూడుబండి కట్టుకుని కాకినాడెళ్ళి మూడాటలూ చూసి తెల్లారాక ఇల్లు చేరడం. ఇంక మగవాళ్ళయితే పగలంతా పేకాట. సాయంకాలం వేట. డిప్రెషన్ దెబ్బకి పైకి ఎవరికీ చెప్పుకోలేక మింగలేక అప్పులవాళ్ళ నూరుకోబెట్టలేక ఉన్నట్టుండి రాత్రి నిద్దట్లోనే ప్రాణాలు వదిలారు పంతులుగారు.

అప్పుడందరూ కళ్ళు తెరచి ఆవలిస్తూ ఆలోచించే లోపే సమయాతీతమైపోయింది. ఆస్తులమ్మడం తప్ప ఎవరికైనా ఏ పనైనా చెయ్యడం వస్తే కదా! అయిదారేళ్ళు గడిచేటప్పటికి పొలాలూ భూములూ తోటలూ ఆ ఊరి కామందులకీ, కరణీకాలు దూరపు దాయాదులకీ అమ్మేసుకుని చెల్లాచెదురైపోయి తలోచోటా నిజంగానే తలదాచుకుని బతుకుతున్నారు. కానీ ఇంత ఆస్తి ఇలా పల్లావుల్లైపోయిందని గానీ, వచ్చిందని గానీ, నలుగురాడపిల్లలూ, ఇద్దరు మగపిల్లలూ చకచకా ఎదిగొస్తున్నారనిగానీ, సరమ్మగారికే బెంగా లేదు. ఎవరి తలరాతెలా ఉంటే అలా జరుగుతుందని ఆవిడకో గట్టి నమ్మకం.

ఆ ఇంట్లో సరమ్మగారు తప్ప మిగతా వాళ్ళంతా అనామకులే అయినప్పటికీ పద్దెనిమిదేళ్ళ మనవరాలు స్వర్ణమాత్రం నిజంగా బంగారు బొమ్మే!

బామ్మకి తగ్గ మనవరాలు. ఏ పనిచేసినా వచ్చూవరం ఉండవు ఓ లేసులల్లడమేనా, ముగ్గులు పెట్టడమేనా, గోరింటాకులు పెట్టడమేనా, ఎవరి పెళ్ళికెళ్ళినా రకరకాల పువ్వుల జడలెయ్యడమేనా అన్నిట్లోనూ ఫస్టే! అవన్నీ చూసే కదా పాపం బాచిగాడనబడే భాస్కరం మనసు పారేసుకున్నదీ! భాస్కరానికి బయట సంబంధం చేసుకుంటే వాళ్ళిచ్చే పదివేలు కట్నంతో ఆఖరిదాని పెళ్ళిచేయాలనుకున్న ఇంటిల్లిపాది ప్లాన్లూ తల్లకిందులైపోయాయి.

'మరి చెల్లాయి పెళ్ళెలారా? అంటే 'నే అప్పుచేసి పెళ్ళిచేసి తరవాత తీర్చుకుంటానమ్మా! స్వర్ణని కాదంటే నేను పెళ్ళే చేసుకోన'ని భీష్మించుకు కూచున్నాడు.

మావయ్య చేసుకోకపోతే నే నూతిలోకి దూకి ఛస్తానని ఇది బెదిరింపు. ఇంక ఎవ్వరూ మారుమాట్లాడకుండా, బాచిగాడి పరీక్షలవగానే ముహూర్తాలు పెట్టుకున్నారు. కన్యాదాత ఆఖరి చెక్క అమ్మేసి రెండువేలు తెచ్చి వీళ్ళ చేతుల్లో పెట్టగానే అది పట్టుకెళ్ళి చెల్లాయి పెళ్ళివారికి కట్నం అడ్వాన్సిచ్చేవారు. ఇంక ఇప్పుడు పెళ్ళి

## దగ్గర దారి

హుడా కాలనీ దారి బాగుంటుందని ఒకడు.
పి అండ్ టి కాలనీ దారి దగ్గిర అని ఒకడు...
గడ్డి అన్నారం దారి మంచిదని ఒకడు...

సిటీ బస్సెక్కిపోతే చవక అని ఒకడు.
ఆటో ఐతే త్వరగా పోవచ్చని ఒకడు..
నడిచెళ్తే ఆరోగ్యమని మొండికేస్తూ ఒకడు...

వరి వాదాలకు వాళ్ళకు ఆధారాలున్నాయి
తరాల అనుభవాలూ
కాలంతో ముడిపడిన మూఢనమ్మకాలూ
అంగబలమూ, అర్థబలమూ
అన్నీ ఉన్నాయి.

గంటనుండీ కీచులాడుకుంటున్నారు
వాదం ఎంతకీ తెగటం లేదు.

వినీ వినీ విసుగెత్తిన
తాత గొంతు పెగిలింది

మీరిట్లా కొట్టుకుంటూ వీధిలో పడితే
ఎప్పటికీ వీధిలోనే ఉండేది
'దిల్ ఖుష్' నగర్ చేరాలని ఉంటే
ప్రయాణం వెంటనే మొదలెట్టండి
ఏ బస్సెక్కినా ప్రమాదం లేదు
ఎవరే మార్గమైనా ఫర్వాలేదు
గమ్యాన్ని మాత్రం మర్చిపోకండి!!!

డి.వి. ఆర్. కె. శాస్త్రి

## పాపం మానాన్న

నిటారుగా నిలిచినా చిటికెనవేలు పట్టి
నడచిన నాన్న ఇపుడు కర్రసాయంతో
అడుగులేస్తున్నాడు
వంగిపోయిన తనువుతో రోజు రోజుకీ
ముడుచుకుపోతున్నాడు
కొత్తకు స్వాగతం పలుకుతున్నాడు
భుజం తట్టి ప్రోత్సహించిన
ఆ మహా మనిషి మౌనభాషతోనే
సరిపెట్టుకుంటున్నాడు
ఆశీస్సులిచ్చి పెంచి పెద్ద చేసిన
మా ఘనతను చూచి మురిసిపోతున్నాడు.

## నేటి నాయకులు

చిక్కరు దొరకరు
కదలరు వదలరు
మెరిసే చుక్కలవుతారు
అక్కరకు రాని పోతు
ముత్యాలవుతారు
సహకరించని సన్నాసులవుతారు
గెలవగానే నీవెవరో
నేనెవరోనని గద్దిస్తారు
నీతి నిజాయితీ లేక ఊరేగుతారు

శైలశ్రీ

ఖర్చులకి అటూ ఏవీలేదు, ఇటూ లేదు. ముహూర్త బలం వల్ల ఆ శుభకార్యం జరగాల్సిందే.

"మా మనవరాలు పుట్టినప్పుడే మా పెద్దవాళ్ళు కట్టించిన వీరేశ్వరుడి గుళ్ళో పెళ్ళి చేస్తామని మొక్కుకున్నాం'' అని చెప్పి సరమ్మగారు వాళ్ళు కాపురం ఉంటున్న ఊళ్ళో సత్రంలో పెళ్ళి అని నిర్ణయించేసింది. అందరికీ కార్డుమీద చేతిరాత ఆహ్వానాలే. శుభలేఖల ఖర్చెందుకు ఊళ్ళో వాళ్ళని బాగుచేయడానికి కాకపోతే! మరుదులకీ ఆడపడుచులకీ తేవాల్సిన బహుమతులన్నీ పురమాయించింది. రామ్మూర్తి పానకం బిందెలూ, కాళ్ళు కడుగు పళ్ళె, సుందరీ వాళ్ళు మధుపర్కాలూ, సుబ్బులు పెళ్ళి కొడుక్కి వాచీ, రాజారాం వాళ్ళు అప్పగింతల బట్టలూ, పెద్ద మేనత్తచేత్తో తలా రెండొందలూ అయిదు రకాల ఫలహారాలు ఇలా పెళ్ళికూతురికిచ్చే సారెతో సహా అన్నీ ఏర్పాటుచేసింది. కాని ఎంత చేసినా మరి ఆ రోజుల్లో ముహూర్తం అయ్యాక పెట్టేదే పెళ్ళి విందు కదా! క్లుప్తంగా చేద్దామన్నా రెండు భోజనాలు రెండు టిఫిన్లూ తప్పడంలేదు. దగ్గిర వాళ్ళే వందమందవుతున్నారు.

నందికేశుడి పేరు చెప్పి మధ్యాహ్నం టిఫిన్లు గట్టె క్కారు. తెల్లారగట్ల లేచి ఎండలో ప్రయాణం చేసి వచ్చారేమో మగ పెళ్ళివారంతా సొమ్మసిల్లి పడున్నారు. రాత్రి వంటలవుతున్నాయి. వంట చేసేది ఒక ముసలాయనా, మనవడూ. వాళ్ళూ సత్యం జట్టులో వాళ్ళే. కాని పెద్ద జట్టు మొత్తం కాకినాడ తాసీల్దారు గారి అమ్మాయి పెళ్ళికి బుక్కయిపోయింది. సత్యం మాత్రం ఏడు మైళ్ళు సైకిల్ మీద తిరుగుతూ అటూఇటూ మాటరానీయకుండా చూస్తున్నాడు. అరటికాయుప్మాకూర, కందిపొడి, గోంగూర, దోసావకాయ, పప్పు పులుసు చిన్నవడ్డన లడ్డు అన్నీ సరిచూసుకుని ఇంక నే వెడుతున్నాని అమ్మగారికి చెప్పాలనుకుంటూ ఆరున్నరకల్లా సైకిలెక్కి వెళ్ళబోతున్న సత్యం ఒక్కసారి ఆగిపోయి చూస్తూ నిలబడిపోయాడు.

తెల్లగా మెరిసిపోతూ రంగురంగుల జంపఖానాలు అలంకరించుకుని పువ్వుల దండలు, చమ్కీలు సింగారించుకుని గంటలు మోగించుకుంటూ నిజమైన పెళ్ళివారిప్పుడొస్తున్నారా అన్నట్టు పాటలూ, పద్యాలతో హోరెత్తుతూ సత్యం ముందు బళ్ళు, ఆడామగా పట్టుబట్టలతో, ఉన్న అన్ని నగలతో, సెంటు సువాసనలతో, పిల్లాపాపా కలిసి అథమపక్షం నాలుగొందలమంది. ఇంకా ఎంతమందున్నారో వెనకబడ్డ బళ్ళు వచ్చి కలుస్తున్నాయి.

'దండాలు పెద్దమ్మగారూ', 'సంతోషం అమ్మగారూ', 'ఇంకా మా మీద దయుంచారండమ్మా', 'మన బామ్మర్ది గారికే ఇత్తన్నారంటగా', 'అబ్బో ఎంత బాగుండారో!' 'ఇక మన బంగారమ్మ కలెక్టరు గారి భార్య అయిపోతారన్న మాట! ఇలా పట్టరాని సంతోషంతో వానాకాలపు జల్లు మీద జల్లులా జడివానలా ఒకటే జనం. ఊర్నించి పెళ్ళి బళ్ళు వచ్చాయని విని సరమ్మగారు వాకిట్లోకి వచ్చింది.

"ఏం కనకయ్యా బాగున్నావా? మమ్మల్ని మర్చిపోయావనుకున్నా, ఏరా కన్నులూ అప్పుడే మనవడుట్రా నీకూ, ఏం పేరు పెట్టావు? బాపినీడు గారూ మా మూల పొలం ఎలా ఉంటుందోనని వెనకాడారు. మొన్న నలభై అయిదు బస్తాలయ్యాయట కదా! ఇలా ఒక్కొక్కళ్ళనే

పలకరిస్తోంది. అందరికీ వాకిట్లో జంపఖానాలు పరిపించి కూచోపెట్టించింది. కోడలు కంగారుపడిపోతోంది. ''అత్తయ్యా! ఎలా? ఎలా?'' అంటూ భయానికి అప్పుడే ఆ అర్భకురాలి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

''నువ్వు మాట్లాడకుండా ఇక్కడ నించిపోయి మీ అమ్మతో కబుర్లు చెప్పుకో! విడిదిల్లు విడిచిపెట్టి రాకు. మన చవటని నేనోసారి పిలిచానని చెప్పు'' అని కోడలికి ఆర్డరేసింది. అదెవరో తెలుసు కాబట్టి కావుడు వెంటనే వెళ్ళిపోయింది. ఇంకా అప్పటికి ఆ సత్రంలో కరెంటు దీపాలు లేవు. అన్నీ నూనె దీపాలే. వాటికన్నా గాడిపొయ్యి వెలుతురే మెరుగ్గా వుంది. భోజనాల టైంకి వెలిగించు కోవచ్చునని చెప్పి రెండు పెట్రోమాక్స్ లైట్లు తెప్పించుం చారు. కాసేపటికి ఆవిడగారి వంశోద్ధారకుడు కన్యాదాత వణుక్కుంటూ వచ్చాడు ''ఏవిటే అమ్మా! పిలిచావుట'' అంటూ.

''నే బతికుండగా తీరువొస్తుందటరా నీకు! మన ఊళ్ళో పెళ్ళి పెట్టుకుంటే తట్టుకోలేమని చెప్పేగదా. దిక్కుమాలిన వాళ్ళల్లా ఈ సత్రంలో చేస్తున్నాం, చిన్న ప్పుడే మొక్కుకున్నామని పుట్టెడబద్ధాలాడీ! ఎక్కడెక్కడి వాళ్ళకో అయిదురోజుల పెళ్ళి చేసిన దాన్ని సొంత మనవ రాలి పెళ్ళి అర్థరాత్రి ముహూర్తం ఏరీకోరీ పెట్టించి గుట్టు చప్పుడు కాకుండా కానిస్తుంటే నీకేవన్నా చీమకుట్టినట్లన్నా ఉందా! బాధ్యత ఎప్పటికి తెలుస్తుందిరా? మన ఊరెప్పు డెళ్ళావ్. వీళ్ళందరినీ ఎప్పుడు పిలిచావ్? పోనీమంటే ఇలా పిల్చానని నాతో మాట మాత్రమైనా చెప్పావా? మన ఇల్లమ్మేశాక నేనావూళ్ళో అడుగుపెట్టానా? ఇప్పుడే గంగలో దూకమంటావురా?''

ఆవిడ మాటలు వింటున్న సత్యం కల్పించుకున్నాడు. ''కంగారుపడకండమ్మా. నేనో గంటాగి వెడతాగా! ఇప్పటి మటుకు అన్నీ సరిపోతాయి. ఒక్క మూట బియ్యం పడేయించండి చాలు. మీకు మాట రానిస్తానా'' అంటూ ఎక్కిన సైకిలు దిగి, అరటిగెల ముందేసు కున్నాడు సత్యం.

''ముహూర్తం పెట్టడానికి పేరయ్య శాస్త్రిగారు మనిం టికి వచ్చినప్పుడే అడిగానే ఓ అయిదొందలు పెళ్ళినాటికి సర్దమని. శివరాత్రెళ్ళాక రమ్మన్నారు. ఆ డబ్బులు తీసు కోడానికి వెళ్ళినప్పుడు అబ్బాయి గారిటొచ్చేరేంటో అని అందరూ అడుగుతుంటే మిమ్మల్ని పెళ్ళికి పిలవడానికి వచ్చారని ఆయన చెప్పారు. ఒకళ్ళకి చెప్పి ఇంకోళ్ళకి చెప్పకపోతే బాగుండదని అందరికీ చెప్పొచ్చాం. శుభలేఖ లివ్వలేదు గదా ఎవరూ రారేమోలే అని నీతో చెప్పలేదు.

## ఆర్ద్రత నిండిన కళ్ళతో!...

ఆర్ద్రత నిండిన కళ్ళతో
అక్షరాల్ని వెతుక్కుంటున్నాను
ఆపన్నులకు హస్తమందించాలనీ
అన్నార్తుల బాధను వివరించాలనీ
అన్యాయంపై ధ్వజమెత్తాలనీ
అవినీతిని అంతమొందించాలనీ
అరాచకులమదమణిగేదాకా మొత్తాలనీ
ముదమందుతూ సదాముదిత ఈజగాన
ఆదిశక్తిగా కీర్తింపబడాలనీ
నేతల ఊహల్లో నిదురోతున్న శాంతిని
సైతం ఈడ్చుకురావాలనీ
నోటుతోటి ఓటును కొనే దౌర్భాగ్యం భావాలనీ
ఓటు విలువలను తెలుసుకుంటూ
మందు భాహనుమటుమాయం చెయ్యాలనీ
బోసినవ్వుల బాలల్లో బాలకార్మికవ్యవస్థ
యోచనరాకూడదనీ
బాపూజీ కలలు కన్న రామరాజ్యం రావాలనీ
ప్రజాస్వామ్యమెపుడూ నేతల ఊహల్లో నిదురోదనీ!
గంటకొట్టి బజాయించి గర్వంగా చెబుతున్నా
ఆలోచన మేల్కొంది ఆయుధాలన్నీ కలాలై
ఉద్యమిస్తున్నయ్
శ్వేతపత్రాలపై గతితప్పిన భవితను
బ్రతకలేని జనతనూ రెక్కపట్టి
ఒక్కలాగ ఈ భువిపై నిలపాలనీ
ఈ జగాన్ని సదానాకంగా మార్చాలనీ
రోజులు మారాయని చెప్పి ఫోజుగానే
మీరంతా కలవాలనీ ఈ జగతిన సదా
చిరంజీవులై మిగలాలనీ! ఆర్ద్రత నిండిన కళ్ళతో!

దోసపాటి
సత్యనారాయణమూర్తి

## బొబ్బిలి నానీలు

బ్రతికినా చచ్చినా
పరులసేవే పరమావధి
వృక్షాలు
ఎంత గొప్పవి!?

'గోదావరి' జిల్లాలు
కవలపిల్లలు
దేశానికి
'అన్నపూర్ణ'లు

ఎన్నేళ్ళొచ్చినా
చందమామ ఎరుగడు
అపార్ట్‌మెంట్స్‌లో
పెరిగాడు గదా!

చిన్న కారు
ఊగుతూపోతోందే?
డ్రైవరు బాబు
బీరులోమునిగాడులే!

పచ్చి పరకలు
వాసన చూపాడు
పాలన్నీ పిండాడు
పసిదూడ పస్తు

మహిళా రిజర్వేషన్
మేడిపండా?
లోపల అంతా
పురుషపురుగులు!

వరుసగా
నాల్గు ఏడులు
లక్కీనెంబర్‌కాదు
లక్కినేని కారు నెంబర్!

అబ్బాయిలు
చదువు'కొంటారు'
అమ్మాయిలకు
'ప్రియం'గా అమ్ముడవ్వాలిగా!

బొబ్బిలి జోసెఫ్

నిజంగా ఇంతమందీ వస్తారనుకోలేదే''

''సర్లే! వాకిట్ల అందరినీ జాగర్తగా పలకరించు. పాపం వాళ్ళేవేళప్పుడు బయల్దేరారో! దాహం కనుక్కో. భోజనాలు ఏర్పాటుచేసి పిలుస్తా'' అంది.

పెళ్ళికని వచ్చిన రైతులెవరూ చేతులూపుకుంటూ రాలా! పది అరటి గెలలూ, గుమ్మడి కాయలూ, ఆనప కాయలూ, బండెడు ఘుమఘుమలాడిపోయే చిన్న రసాలూ, పెళ్ళివేళ దాహానికని కొబ్బరి బోండాలూ, అయిదు వీశల నెయ్యీ, అరిశెలు అన్నీ తెచ్చారు గానీ బియ్యంమూట మాత్రం ఎవరూ తేలేదు. ధైర్యంగా మిగతా వంట కానిస్తున్నారు. ఎసళ్ళు మరిగిపోతున్నాయి. ముందు మగపెళ్ళివారి భోజనాలవుతున్నాయి. వంట సావిట్లో సత్రం గుండిగలు మెరిసిపోతున్నాయి. ఆవిడ నెమ్మదిగా ప్రభాకరాన్ని పిలిపించింది.

''ఒరే! దొడ్డిగుమ్మం దగ్గరికి కళ్ళిగాడ్ని బండి తోలుకు రమ్మను! ఇదిగో ఈ గుండిగట్టికెళ్ళి కాస్త అసింటా ఉన్న ఏ కొట్లోనో పెట్టి బస్తా బియ్యం మంచివి వేయించుకురా! ఎవరికంటా పడకూడదు. తెల్లారేటప్పటికి విడిపించుకుంటాం అని చెప్పు. ఇక్కడున్నట్టు రావాలి. ఈ విషయం బయటకి పొక్కిందో అదిగో ఆ గుళ్ళో కూచున్న మూడోకంటివాడి సాక్షిగా ఈ నూతిలోకి తోసేస్తానిన్ను! వినిపిస్తోందా?'' వాడు మహా అసాధ్యుడు. నెమ్మదిగా గుండిగ నీళ్ళు పారబోసి బండిలో పెట్టుకునెళ్ళి పావుగంటలో బియ్యం బస్తాతో తిరిగొచ్చాడు.

''ఎవరన్నా చూశారేమిట్రా?''

''లేదు. దొడ్డా! కొట్లో కూడా వెలుతురు లేదు. తెల్లారేలోపు వచ్చి తీసుకుంటా అని తీసుకొచ్చా... అవునూ! ఇప్పుడు లేని డబ్బులప్పుడెక్కడ్నిం చొస్తాయే?''

''నీ అత్తారిస్తార్లే వెధవా! అన్నీ ఆరాలే! ఇంక ఇక్కడ చేసింది చాలుగానీ పోయి వడ్డన కలుస్తోందో, లేదో చూడు. అరటికాయ ముక్కల్లో అగరొత్తులు గుచ్చారో లేదో! కళ్ళిగాడ్ని రాయబారం పద్యాలందుకోమన్నాని చెప్పు!''

ఆఖరి బంతి భోజనాలవుతుండగానే పెళ్ళికూతురికి తలంటుపోయడానికి వెళ్ళిపోయింది. పెద్ద తలకట్టు, సాంబ్రాణి పొగేసి చిక్కులు తీసి పొడుగు మొగ్గలూ కనకాంబరాలూ దవనంతో వదులు వదులుగా వంకీల జడ. జడ కుప్పెలు. జడ చూస్తేనే కళ్ళు తిప్పుకోలే. ఎప్పుడో ఏణ్ణర్థంనించీ దాచుంచిన తోపురంగు ఆరణి పట్టుచీర ప్లీడరుగారి అబ్బాయి పెళ్ళికి కావుడికి పెట్టింది

ఇప్పుడు గౌరీపూజకి అక్కరకొచ్చింది. కోరుకున్న మొగుడు దొరికాడన్న సంబరంతో కళకళ్ళాడిపోయే ఆ చక్కదనానికి వేరే అలంకారాలెందుకుట.

నాలుగుంపావుకి ముహూర్తం అయింది. స్వామివారి తరపున వచ్చిన గుండుమల్లె పూలదండలతో పెళ్ళిమండపం గుబాళించిపోయింది. వాళ్ళిద్దరి తలంబ్రాల పోటీ కాదుగానీ చుట్టూ మూగిన పిల్లమేళం నెత్తినకూడా అక్షింతలు కనిపించాయి. పెళ్ళికొడుక్కి పిల్ల ధ్యాస తప్ప వేరే ఏ ధ్యాసా లేదు.

ఇక చదివింపులు మొదలయ్యాయి. అన్నీ విస్సన్న పంతులుగారి మనుమరాలు చి॥ సౌ॥ స్వర్ణలతాదేవికే. పెద్దిరాజుగారూ, కనకయ్యగారూ, బాపినీడుగారూ, వెంకాయప్పగారూ, సీతయ్యశెట్టిగారూ, భద్రిరాజూ, వెంకట్రావుడూ... చదివింపులవుతూనే ఎండెక్కేలోపల ఊరు చేరాలని బళ్ళు బయల్దేరాయి. ఫలహారాల పర్యవేక్షణకి వంటసావిట్లోకి వెళ్ళింది కళ్ళు తుడుచుకుంటూ సరమ్మగారు. ఊళ్ళోకి బండెక్కి షికారెళ్ళిన గుండిగ మళ్ళీ వచ్చి నేస్తాల సరసన ఏవీ ఎరగనట్లు గట్టెక్కింది.

అప్పగింతలై పెళ్ళివారెళ్ళిపోయాక చూసుకుంటే అన్ని ఖర్చులూ పోనూ, రెండొందల రొఖ్ఖం, మూడు నెల గ్రాసం మిగిలాయి. సత్యం చేతిలో యాభై రూపాయలు పెట్టబోతే ''వద్దంటే వద్దు! స్వర్ణమ్మ నాకేవీ కాదా'' అంటూ దణ్ణంపెట్టి సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

అలా మావయ్యని వరించి పెళ్ళాడిన స్వర్ణ, తాతగారు రాసిన జాతకం పొల్లుపోకుండా మగడికి ముద్రికాయోగం పట్టించి, బామ్మ దీవెనలు ఫలించి తన ఇల్లు వేయిళ్ళ మొదలై, చుట్టాల సురభి అయి, బంధువుల భాగ్యశాలి అయి, నూలు లేని పుట్టం కట్టుకుని, లక్కలేని సొమ్ములు పెట్టుకుని తన పెళ్ళి స్వర్ణోత్సవం కూడా జరుపుకుంది.

ప్రస్తుతం అమెరికాలో పుట్టి పెరిగిన తన మనవరాలి పెళ్ళి ఏర్పాట్లు చేయాలని తాపత్రయపడుతోంది. మాటి మాటికీ బామ్మని తల్చుకుంటూ ఆవిడెంత కష్టపడిందో నని నిట్టూరుస్తోంది. ఇంకా ముహూర్తం నెల్లాళ్ళుంది. ఆడపెళ్ళివారూ, మగపెళ్ళివారూ అందరూ అక్కడ్నించి రావాల్సిందే. ఇక్కడ లంకంత కొంపలో పెద్దవాళ్ళు తప్ప ఎవరూ లేరు. పెళ్ళికూతురికి ఇండియాలోనే పెళ్ళి చేసుకోవాలని మనసేయడంతో ఇరుపక్షాల వారూ సగం బోయింగు మాట్లాడుకుని వస్తారుట ముహూర్తానికి మూడు రోజుల ముందు.

## నానీలు

వనంలో
పూల కిలకిలలు
దేశంలో
కులమతాల కుమ్ములాటలు

రాలిన ఆకులు
పువ్వులు...
చినుకులు అద్దుకొని
'నేల' సింగారంగా!!!

కలలుకనే కళ్ళే నీవి
ఆ గూటిలో
కాపురం చేసే
మనసే నాది

పెదాల భూమి
బీటలు వారితే
కవిత్వ దాహం
తీరేదెలా?

*యలమర్తి అనూరాధ*

## అక్షరాల ఆకాంక్ష

అతని
కలం గర్భం నుండి
అందమైన శిశువులుగా
పురుడుపోసుకోవాలని
అక్షరాల తహతహ.

## బందీ

ఆకాశం దించిన
చినుకుల ఊచల వెనుక
నా గదిలో నేనే
బైటికి పోలేక
బందీనయ్యా!

*మాధవీ సనారా*

## విజయం

వడివడిగా పరుగిడే
మనసు ఆలోచనా
గుర్రాల కళ్ళేలను
వడుపుగా అదుపుచేసి
సరిగా అడుగేయించి
నడిపించి-
విజయాన్ని సాధించు.

## తల్లీ పెళ్ళాం

నా జీవిత రైలు బండికి
నా తల్లీ, నా పెళ్ళాం
రెండు పట్టాలు
పక్కపక్కన వుంటున్నా
ఎప్పుడూ కలవవు
ఎన్నడూ కలవలేవు
నాకున్న రెండు కళ్ళలా

## లోకం తీరు

పెడ్తూ వుంటేనే
నాయమ్మ అంటారు
పెట్టనినాడు
నీయమ్మ అంటారు

## అజ్ఞానం

కనుతెరువక ముందు
మహామేధావులం అందరం
విశ్వాన్ని వీక్షించిన తక్షణం
ఆవరించింది
అజ్ఞాన అవలక్షణం

సింగార
సుబ్బరాయుడు

## కుంభమేళా

వృద్ధులైన అమ్మా-నాన్నలను
మేళాలో వదిలించుకొని
తప్పించుకపోతారు - కొందరు పిల్లలు
తప్పిపోయిన తమ పిల్లలను
మేళాలో వెదికి పట్టుకునేందుకు
పనిగట్టుక వెడతారు -
అందరు అమ్మానాన్నలు

ఎమ్.సి. ఆంజనేయులు

''ఎలాగో! ఏవిటో! ఏం చెయ్యాలో'' అని కంగారు పడుతుంటే భాస్కరరావు గారి గొంతు వినిపించింది.

''ఇదిగో బంగారూ! విశ్వం ఫోన్ చేశాడు. పెళ్ళి పనులన్నీ ఎవరో ఈవెంట్ మేనేజరుట. వాళ్ళకప్పజెప్పాడుట. మనిద్దరం దేనికీ హైరానా పడక్కర్లేదు. అన్నీ వాళ్ళే చూసుకుంటారుట''

''మనల్ని కష్టపెట్టకూడదని వాడికెంత తాపత్రయమో! పోనీలే ఇదీ మన మంచికే''

''ఎందుక్కాదు! మనకన్నా పుచ్చుకునే వాడికి మరీ మంచిది. మూడు లక్షల అడ్వాన్సు!''

''అడ్వాన్స్ మూడైతే మొత్తం బిల్లెంతవుతుందో! ఇంతకీ అన్ని లక్షలుచ్చుకుని వాళ్ళేం పనులు చేస్తారో!''

''పెళ్ళి పిలుపులు, రిజర్వేషన్లు, హోటళ్ళు, పెళ్ళి బ్రాహ్మణులు, వీడియోలు, వాయినాలు, బహుమతులు, రిసెప్షను కచేరీ... ఒకటేవిటి మూడు ముళ్ళేయడం తప్ప అన్నీ వాళ్ళే చేస్తారుట. పెళ్ళి పెత్తనం చేద్దామని ఆశపడ్డట్టున్నావ్ పాపం! మనం వాళ్ళెక్కడ కూచోమంటే అక్కడ కూచోవాలి. పెట్టినది తినాలి! అన్నట్లు కాయితం పెన్ను పట్రా. మన వాళ్ళ లిస్టు తయారు చేద్దాం - అదొక్కటే మనం చేయ వలసిన పని''

పెన్నందిస్తూ అడిగింది - ''మరి పెళ్ళికొడుకు తల్లి ముహూర్తానికి చీర తెచ్చుకుంటుందా? లేకపోతే అత్తగారి లాంచనంచీర ముందే ఇచ్చేయమంటుందా?''

''నాకేం తెలుసు! వెళ్ళి గుండిగనడుగు తెలుస్తుంది''

''గుండిగనడగడమేం ఖర్మ. ఏకంగా బామ్మనే అడుగుతాను రాత్రి కల్లోకొచ్చినప్పుడు. అయినా ప్రేమ పెళ్ళంటారు. ఇంత ఖర్చేమిటో! నాకప్పజెపితే ఒక్క లక్ష మిగిల్చి ఏ పేదింటి పిల్లకో అక్షింతలు పడేయించకపోదునా! డబ్బు లక్ష్యాలూ లేవు. ఏ లక్ష్యాలూ లేవు. పాపం బామ్మకి తెలిస్తే ఏం అనేదో!'' ■